క్లుప్తంగా

గెడ్డ వాగులో షెడ్ల తొలగింపు



గంభీరం గెడ్డ వాగులో జేసీబీతో తొలగించిన షెడ్లు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ సర్వే నంబర్ 173లో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆనుకుని గెడ్డ వాగులో నిర్మించిన రెండు షెడ్లతో పాటు చుట్టూ ఉన్న కాంపౌండ్ పునాదులను రెవెన్యూ అధికారులు సోమ వారం తొలగించారు. వారం రోజులుగా కూటమి నాయకులు పునాదులు, ప్రహరీతో పాటు షెడ్ల నిర్మాణం చేపడుతున్న సంగతి తెలిసిందే. ఇక్కడ 60 గజాల వంతున మూడు షెడ్లు నిర్మించి రూ.45 లక్షలకు విక్రయించడానికి ఒప్పందం కూడా చేసుకున్నారు. దీనిపై 'గెడ్డ వాగులో వెలసిన షెడ్లు' శీర్షికతో సోమవారం సాక్షిలో ప్రచురించిన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. జేసీబీ సాయంతో వీటిని కూల్చివేశారు.

బోనిలో షెడ్ల కూల్చివేత

తగరపువలస: బోని పంచాయతీలో మాన్సాస్ భూములలో నిర్మించిన ఆరు షెడ్లను రెవెన్యూ అధికారులు సోమవారం వేకువజామున కూల్చేశారు. ఇటీవల కలెక్టర్‌కు మాన్సాస్ ప్రతినిధులు చేసిన ఫిర్యాదు మేరకు వీటిని తొలగించినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

'పరీక్షా పే చర్చ' వీక్షించిన ఛాత్రోపాధ్యాయులు



డైట్‌లో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఛాత్రోపాధ్యాయులు

భీమునిపట్నం: పరీక్షల సమయంలో విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జరిగిన పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని భీమిలిలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు సోమవారం వీక్షించారు. డైట్ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి మాట్లాడుతూ పరీక్షా పే చర్చ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వారిలో ప్రధాని స్ఫూర్తి నింపారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు సుమారు 92వేల మంది ఈ కార్యక్రమాన్ని వీక్షించారని తెలియజేశారు.

ఇసుకలో కూరుకుపోయిన ఇన్నోవా



ఇన్నోవాను ఇసుకలోంచి లాగుతున్న ట్రాక్టర్

భీమునిపట్నం: భీమిలి బీచ్‌వద్ద సోమవారం ఒక ఇన్నోవా కారు ఇసుకలో కూరుకుపోయింది. ఇక్కడ బీచ్ బస్టాప్ పక్కన కిందికి వెళ్లడానికి దారి ఉంది. అక్కడ కొంతదూరం వరకు వాహనాలు వెళతాయి. అక్కడి నుంచి ఇసుక ఉండడంతో వాహనాలు వెళ్లలేవు. అయితే ఒక ఇన్నోవా కారు కిందికి దిగి నేరుగా ఇసుకలోకి వెళ్లడంతో టైర్లు ఇసుకలో కూరుకుపోయాయి. ఎంత ప్రయత్నించినా బయటకు రాలేదు. బీచ్‌లోని చెత్తను తొలగించే ట్రాక్టర్ దగ్గరలో ఉండగా, దాని సాయంతో తాడు కట్టి లాగడంతో వాహనం బయటకు వచ్చింది.

అధ్యాపకులకు నూతన అంశాలపై అవగాహన అవసరం



ఎఫ్‌డీపీలో పాల్గొన్న అధ్యాపకులు

కొమ్మాది: రుషికొండ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'వీఎల్‌ఎస్‌ఐ సిస్టమ్ డిజైన్ యూజింగ్ ఓపెన్ సోర్స్ టూల్స్' అంశంపై రెండు వారాల పాటు జరగనున్న ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సహకారంతో గౌహతి, జబల్‌పూర్, రూర్కెలా ఐఐటీలు, పాట్నా ఎన్ఐటీతో కలిసి గీతం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఈఈసీఈ విభాగాధిపతి పి.భరణ్‌చంద్రకుమార్ తెలిపారు. గౌహతి ఐఐటీ ప్రొఫెసర్ గౌరవ్ త్రివేది ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ అధ్యాపకులు నూతన అంశాలపై అవగాహన పెంచుకోవలసిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ సీహెచ్‌ఆర్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ నగరంలో ఈ ప్రాంతానికి కొత్తగా వచ్చినవారు కారుషెడ్ చిరునామాతో వచ్చి కారుషెడ్ ఎక్కడ ఉందా అని వెదుకుతారు. కారు షెడ్ తమకు కనిపించలేదు సరికదా అదొక కూడలి పేరు మాత్రమే అని తెలుసుకుని కొంత ఆశ్చర్యానికి లోనవుతారు. అసలు ఆ జంక్షన్‌కు ఆ పేరు ఎలా వచ్చిందంటే..

కారూ లేదు.. షెడ్డూ లేదు



కారుషెడ్ ఓనర్ నర్సింహ నాయుడు నివాస భవనం

- జంక్షన్ పేరే మిగిలింది
- మహానగరంలో ల్యాండ్‌మార్క్‌గా కార్‌షెడ్



కారుషెడ్ కూడలి

ఇప్పుడు ఇలా ...

పీఎం పాలెం రత్నగిరి హౌసింగ్ బోర్డు కాలనీ రాకతో ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోయాయి. విస్తృతంగా నివాస స్థలాలుగా అపార్టుమెంట్లు లేచాయి. 8 అడుగుల రోడ్డు చెన్నై–భువనేశ్వర్ జాతీయ రహదారిగా అభివృద్ధి చెందింది. కారు, షెడ్ కాలగర్భంలో కలిసి పోయాయి. కారుషెడ్ పేరు మాత్రం చిరస్థాయిగా నిలిచి పోయింది. జాతీయ రహదారి వద్ద కారుషెడ్ కూడలి ఒక ముఖ్య కూడలిగా స్థానం సంపాదించుకుంది.

పీఎం పాలెం: మహా విశాఖలో జగదాంబ, రామకృష్ణా బీచ్, కైలాసగిరి, పోర్టు, బీహెచ్‌పీవీ, చావులమదుం, తదితర ల్యాండ్ మార్క్‌లు ఎన్నో ఉన్నాయి. అలా నిలిచిన మరో ల్యాండ్‌మార్క్ కారుషెడ్. వాస్తవానికి కారూ, షెడ్ కాలగర్భంలో కనుమరుగయ్యాయి. కారుషెడ్ పేరు మాత్రం చిరస్థాయిగా నిలిచి పోయింది. అదే పీఎం పాలెం కారుషెడ్ జంక్షన్.

కారుషెడ్ పేరు వచ్చిందిలా..

ఈ ప్రాంతంలో పోతిన వారి వంశస్తులకు ప్రత్యేక స్థానం ఉంది. ఆ వంశానికి చెందిన ఐదుగురు అన్నదమ్ముల్లో చివరివాడైన పోతిన నర్సింహ నాయుడు నాయకుడిగా పేరు ప్రతిష్టలు సంపాదించారు. ఉమ్మడి కుటుంబ నిర్వహణా సారథి ఆయనే. దేశ స్వాతంత్ర్యానికి ముందు వందలాది ఎకరాలలో ఆహార ధాన్యాలతో పాటు వాణిజ్య పంట అయిన పొగాకును విస్తారంగా పండించే వారు. కుటుంబ సభ్యులందరూ వ్యవసాయ పనిపాటల్లో ఉంటే నరసింహ నాయుడు పొగాకు మార్కెటింగ్, కోర్టు వ్యవహారాలు తదితర బయట పనులు చక్కబెట్టే వాడు. అప్పట్లో సరైన రవాణా సదుపాయం లేదు. ఎడ్ల బళ్లు, ఉదయం సాయంత్రం మాత్రమే వచ్చే ఒకటీ అరా బస్సులే దిక్కు. రాకపోకలకు కాలినడక ప్రయాణం తప్పదు. అటువంటి పరిస్థితిలో నర్సింహ నాయుడు తనకోసం ఒక కారు కొనుక్కున్నాడు. ఈ ప్రాంతంలో మొట్టమొదట కారు కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందాడు. కారు అయితే కొన్నారు కానీ, వారి నివాసం వరకు సరైన రహదారి సదుపాయం లేదు. విశాఖ నుంచి విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు వెళ్లడానికి 8 అడగుల వెడల్పు కలిగిన తారు రోడ్డు ఉండేది. దీంతో తమ నివాసానికి సమీపంలో ఉన్న కూడలికి సమీపంలో కారు పెట్టుకునేందుకు ఓ షెడ్ నిర్మించారు. అందులో తన కారును పెట్టేవారు. అక్కడి నుంచి ఇంటికి కాలినడకన వెళ్లేవారు. ఇది నిత్య కృత్యం.

క్రమంగా కారుషెడ్ ఏరియా స్థానికులు బాతాఖానీ కొట్టడానికి అనుకూలంగా ఉండటంతో కారుషెడ్ ప్రాంతం వద్ద స్థానికులు చేరేవారు. దీంతో చిన్నచిన్న టీకొట్లు, బడ్డీలు లేచాయి. కాలక్రమేణా ఆ ప్రాంత వాసులకు కారుషెడ్ చిరునామాగా మారింది.

ఆయన వల్లే ఇంత అభివృద్ధి



ఎంతో వెనుకబడిన ఈ ప్రాంత వాసులకు సైకిల్ ఉంటేనే గొప్ప. ఈ పరగణాలో సొంత కారుకలిగిన వ్యక్తిగా నర్సింహనాయుడు ఆ కాలంలో పెద్ద మనిషిగా ఎంతో పేరు పొందారు. ఇంత అభివృద్ధికి ఆయనే మొదటి బీజం వేశారు. కారుషెడ్ నామ కర్త ఆయనే.

– పోతిన సింగన్న, పాత పీఎం పాలెం

కోడ్ ముగియగానే రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ఆనందపురం పంచాయతీ ఎస్సీ బీసీ కాలనీలో డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణం చేపడతామని సర్పంచ్ చందక లక్ష్మి తెలిపారు. కాలనీలో రోడ్లు, మెట్లు, డ్రైనేజీలు లేకపోడంతో పాటు ఇరువైపులా తుప్పలతో ఉండటంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'జీవనం దుర్భరం' శీర్షికతో ఈ నెల 8న సాక్షిలో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. కాలనీలో తుప్పలు, రాళ్లు తొలగింపచేసి శుభ్రం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరయ్యాయన్నారు. శంకుస్థాపన కూడా చేసినా, అనివార్య కారణాల వలన కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదన్నారు. స్పిల్‌ఓవర్ కింద తిరిగి గత నెల 25న పనులు మంజూరయ్యాయని తెలిపారు. శాసన మండలి ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులకు ఆటంకం ఏర్పడిందని, కోడ్ ముగిసిన తరువాత రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రారంభిస్తామని తెలియజేశారు.



ఆనందపురం ఎస్సీ, బీసీ కాలనీలో ఇరువైపులా తుప్పలు, రాళ్లు తొలగించిన దృశ్యం

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం

మధురవాడ: పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు వారి తరఫున తమ పార్టీ పోరాటం చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు నింపే కార్యక్రమాన్ని మారికవలసలో సీపీఐ మధురవాడ ఏరియా సమితి ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన పైడిరాజు మాట్లాడుతూ మంగళవారం కూడా మారికవలసలోనే దరఖాస్తులు నింపుతామన్నారు. ఈ నెల 16 వరకు తమ పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో పలు చోట్ల దరఖాస్తులు నింపుతామని, ఈ నెల 17న ఆయా మండల తహసీల్దార్లకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా సమితి నాయకులు వాండ్రాసి సత్యనారాయణ, కేశవయ్య, ఎంఎస్ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.



మారికవలసలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు నింపుతున్న పైడిరాజు తదితరులు

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

భీమునిపట్నం: కడుపులో నులిపురుగులు చేరితే మూత్రపిండాలు, గుండె, కాలేయం మొదలైన అవయవాలకు ఇబ్బందులు వస్తాయని పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యుడు కల్యాణ చక్రవర్తి అన్నారు. వాటిని నివారించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను సోమవారం పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ రాంప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిట్టివలస కళాశాలలో..

తగరపువలస: చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి సోమవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. స్థానిక యూపీహెచ్‌సీకి చెందిన ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



జూనియర్ కళాశాల విద్యార్థులకు మాత్రలు అందిస్తున్న డాక్టర్ కల్యాణ చక్రవర్తి

కోడి, మేకలపై విషప్రయోగం

తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ కొత్తూరుకు చెందిన కుప్ప నరసింగరావు, పైడిరాజు దంపతులకు చెందిన మూడు మేకలు, ఒక కోడిని విషప్రయోగం చేసి చంపేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నరసింగరావు కుటుంబంతో ఏడాది కాలంగా విభేదాలు ఉన్న సమీపంలోని వ్యక్తే వీటిని హతమార్చినట్టు బాధితులు ఆరోపించారు. నిందితుడు గతంలో బాధితులకు చెందిన గడ్డికుప్ప తగలబెట్టడం, మూడు కోడి పుంజుల పీక నులిమి చంపేయడం వంటి సంఘటనలు కూడా జరిగాయని తెలిపారు. అప్పట్లో నిందితుడు తన తప్పులను ఒప్పుకున్నాడన్నారు. తిరిగి ఈ నెల 8న నరసింగరావు వేకువజామున దొడ్డిలో మేకలను మేరేచోటుకు మార్చాలని వెళ్లినప్పుడు అవి చనిపోయి ఉన్నాయి. వీటి శరీరంలో సూదులు గుచ్చిన ఆనవాళ్లు ఉండటంతో భీమిలి పోలీసులను ఆశ్రయించారు.

నిందితుడికి టీడీపీ నాయకుల అండ..?

పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు నిందితునికి కొమ్ము కాయడంతో పోలీసులు ఆరోజు ఫిర్యాదు తీసుకోలేదు. 9వ తేదీన కూడా ఎవరూ పట్టించుకోకపోవడంతో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకుల సాయంతో దాకమర్రి పశువైద్యశాల అధికారులను సంప్రదించారు. అక్కడి వైద్య సిబ్బంది నగరంలోని జడ్జి కోర్టు వద్ద పశు వైద్యశాలలో వీటికి పోస్టుమార్టం నిర్వహించి విషప్రయోగం జరిగినట్టుగా ప్రాథమికంగా నిర్ధారించారు. ఇందులో ఒక మేక గర్భంతో ఉండగా, దాని పొట్టలో నుంచి మరో రెండు చనిపోయిన పిల్ల మేకలను బయటకు తీశారు. చనిపోయిన మేకలు, కోడి శరీరంపై సూదులు గుచ్చిన ఆనవాళ్లు స్పష్టంగా ఉన్నట్టు బాధితులు తెలిపారు. వీటి విలువ రూ.30వేలు ఉంటాయన్నారు. దీంతో భీమిలి పోలీసులు ఆలస్యంగా కేసు దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నివేదిక రావడానికి సమయం పడుతుందని పశువైద్యాధికారులు బాధితులకు తెలిపారు.



విష ప్రయోగంతో మృత్యువాత పడిన మేకలు, కోడి

ఘనంగా దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు చిట్టివలస బొగ్గురోడ్డు దుర్గాలమ్మ ఆలయ మూడో వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. పరిసర ప్రాంతాల భక్తులు ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. చిల్లపేట, సంతపేట, జీరుపేటకు చెందిన బైటోభజన బృందం కళాకారులు అమ్మవారిని కీర్తిస్తూ పాటలు పాడారు. వేడుకలలో ఆలయ కమిటీ ప్రతినిధులు రంగూరి సీతారామదొర, చిల్ల భాస్కరరెడ్డి, పిట్ట వెంకటరావు, సరగడ శివాంజనేయరెడ్డి, చేట్ల త్రినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారి విగ్రహాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పల్లకీలో కొలువుదీర్చి కృష్ణాపురం, పద్మనాభం గ్రామాల్లో ఊరేగించారు. మహిళలు కలశాలతో అమ్మవారి వెంట సాగారు. అమ్మవారికి జలాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. పరిసర ప్రాంతాలతో పాటు విజయనగరం, విశాఖపట్నం, భీమునిపట్నం నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, టీడీపీ నాయకుడు కంటుబోతు ఎర్నాయుడు, నాళం సత్యకృష్ణ, ముప్పంది శ్రీనివాసరావు, ముప్పిడి సుందరరావు, జంగాల నర్సింహమూర్తి పాల్గొన్నారు.

అధ్వానంగా విద్యుత్ సబ్‌స్టేషన్ మార్గం



విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే రోడ్డు

పీఎం పాలెం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో వివిధ పనులపై వెళ్లే వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి సాంకేతిక కళాశాల మీదుగా ఉన్న ప్రధాన రహదారి నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభించారు. 90 శాతం మేర నిర్మాణ పనులు పూర్తి చేశారు. అయితే, సుమారు 100 మీటర్ల మేర రోడ్డు నిర్మించాల్సి ఉండగా పనులు నిలిపివేశారు. దీంతో రాళ్లు తేలిన కచ్చా రోడ్డుపైనే ప్రయాణించవలసి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డును పూర్తి స్థాయిలో సీసీ రోడ్డుగా నిర్మించాలని కోరుతున్నారు

ముగిసిన గాయత్రీదేవి ఆలయ వార్షిక వేడుకలు



గాయత్రీ దేవి సన్నిధిలో వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు తదితరులు

పద్మనాభం: మండలంలోని బుడ్డివలస అగ్రహారం పంచాయతీ లింగన్నపేటలో మూడు రోజుల నుంచి జరుగుతున్న వేద మాత గాయత్రీ దేవి ఆలయ 12వ వార్షిక వేడుకలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గాయత్రి, లలిత, దుర్గాదేవి విగ్రహాలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. లలితా పారాయణం చేశారు. తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. వేదమాత గాయత్రీ దేవిని వైఎస్సార్‌సీపీ భీమునిపట్నం నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకుడు నేరేళ్ల విశ్వేశ్వరశర్మ పూర్ణ కలశంతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ పద్మనాభం మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఆనందపురం మండల అధ్యక్షుడు బంక సత్యం, బుడ్డివలస–అగ్రహారం సర్పంచ్ పిన్నింటి సూర్యనారాయణ, బి.ఆర్.తాళ్లవలస ఎంపీటీసీ చందక పైడినాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దాట్ల పెదబాబు, సుంకర బంగారప్పడు, కోండ్రోతు శ్రీనివాసరావు, గాడు అప్పలరాజు ఉన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



స్పోర్ట్స్ కిట్లతో భీమిలి పండిట్ నెహ్రూ హైస్కూల్ విద్యార్థినులు

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ పండిట్ నెహ్రూ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు నాంది ఫౌండేషన్ సోమవారం స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేసింది. పాఠశాలలోని 131 మంది విద్యార్థినులకు వీటిని అందించారు. ప్రధానోపాధ్యాయిని తిరుమల శ్రీదేవి మాట్లాడుతూ కిట్‌లో టీషర్ట్, షూ, క్రీడా సామగ్రి, శానిటరీ నేప్కిన్స్, నోట్ పుస్తకాలు ఉంటాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ స్కిల్ అసోసియేట్ లీల, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాటితూరు హైస్కూల్లో..

తగరపువలస: తాటితూరు జెడ్పీ హైస్కూల్లో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న 90 మంది విద్యార్థినులకు నాంది ఫౌండేషన్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేసింది. హెచ్ఎం డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫౌండేషన్ ఏటా విద్యార్థుల వికాసానికి ట్యూషన్లు, శారీరక, మానసిక దృఢత్వానికి స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ బుడుమూరి సోమేశ్వరరావు, నాంది స్కిల్ అసోసియేట్ రేణుక, ఉపాధ్యాయ కమిటీ కార్యదర్శి టీఎస్‌వీ ప్రసాదరావు పాల్గొన్నారు.

రీ సర్వే పరిశీలించిన జేసీ




గంధవరంలో రీ సర్వే వివరాలను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

పద్మనాభం: భూముల రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సూచించారు. మండలంలోని గంధవరంలో సోమవారం పర్యటించిన ఆయన రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రోజు వారి ఎన్ని చెల్లా నంబర్లు సర్వే చేశారో రాసి ఉంచుకోవాలన్నారు.

ఈ–క్రాప్ నమోదు తనిఖీ

అనంతవరంలో రాగి, గంధవరంలో మినప ఈ–పంట నమోదును జేసీ క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. రైతులు రబీ సీజన్‌లో వేసిన పంటలకు గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ క్రాప్ నమోదు చేయాలన్నారు. ఈ క్రాప్ నమోదు ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గంధవరంలో గతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో డాక్యుమెంట్లు కాలిపోయాయని, రీ సర్వేలో తమను డాక్యుమెట్లు అడుగుతున్నారని రైతులు జేసీకి విన్నవించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, ఆర్డీవో సంగీత్ మాథుర్, తహసీల్దార్ కాకర అనందరావు, ఏవో ఎంవీఎస్ చలం పాల్గొన్నారు.

అమిత పరాక్రమవంతుడు శ్రీరాముడు



ప్రవచనం వినిపిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: శ్రీరాముడు అమిత పరాక్రమవంతుడని ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఆయన వంటి పరాక్రమవంతుడు లోకంలో మరొకరు లేరని అన్నారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న సంపూర్ణ శ్రీరామాయణ ప్రవచనాల్లో భాగంగా 17వ రోజు సోమవారం ఆయన అరణ్యకాండలో పలు అంశాలు వివరించారు. శ్రీరాముడు దాదాపు ఒక గంట 12 నిమిషాల సమయంలో 14వేల మంది ఖర దూషణాది రాక్షసులను సంహరించాడని తెలిపారు. సీతాపహరణానికి రావణుని శూర్పణఖ ప్రేరేపించడం, రావణుడు మారీచుని సహాయం కోరడం తదితర విషయాలు వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

గుండెపోటుకు ప్రభుత్వాస్పత్రుల్లో అత్యవసర చికిత్స

భీమునిపట్నం: గుండెపోటుకు గురైన వారికి అత్యవసర చికిత్సను అందించే అవకాశం ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉందని ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యుడు ఫణికుమార్ తెలిపారు. గుండెపోటుకు సంబంధించిన ఎస్టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్ (స్టెమీ)పై ఆస్పత్రి వద్ద ఏఎన్ఎంలు, రోగులకు అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురయ్యేవారికి గుండెల్లో నొప్పి, ఆయాసం రావడంతో పాటు అపస్మారక స్థితికి చేరుకుంటారని, అటువంటి వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువస్తే వారికి రూ.45వేల విలువైన ఇంజక్షన్ ఇస్తామని తెలిపారు. తద్వారా ప్రాణాపాయం తప్పుతుందన్నారు. దీనికి సంబంధించి అన్నిప్రాంతాల్లో అవగాహన కల్పించాలని, అత్యవసర సమయాల్లో ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

ట్రాన్స్‌జెండర్స్ సమస్యలు అర్థం చేసుకోవాలి

విద్యాశాఖ ఆర్జేడీ విజయ్‌భాస్కర్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయ్‌భాస్కర్

మధురవాడ: ట్రాన్స్‌జెండర్స్ సమస్యలు అర్థం చేసుకుని, జనజీవన స్రవంతిలో కలుపుకొంటే వారు సమాజానికి ఉపయోగకరంగా జీవిస్తారని విద్యాశాఖ ఆర్జేడీ విజయ్‌భాస్కర్ అన్నారు. ట్రాన్స్‌జెండర్స్ సమస్యలు...సాధికారతపై చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీ తోడు సంస్థ ప్రతినిధి డాక్టర్ అమిత మాట్లాడుతూ పాఠశాల నుంచి, సమాజం నుంచి వారు వివక్ష, నిందలు ఎదుర్కొంటున్నారన్నారు. వారిని ఆదరించాలని తెలిపారు. హెచ్ఎం రవి ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.